



పసందైన పిండివంటలు

సంక్రాంతి పండుగంటే పిండివంటలు ఘుమఘుమలాడిల్సిందే. ఒకటా.. రెండా.. సకినాలు, అరిసెలు, గారెలు, చెకోడీలు, పూసలు, మురుకులు, నువ్వులముద్దలు.. ఆహా నోరూరిపోవాల్సిందే. ఈ పసందైన పిండివంటకాలు తయారు చేయడంలో మహిళలు బిజీ అయ్యారు. భోగి, సంక్రాంతి, కనుమను పురస్కరించుకుని మూడు రోజుల పాటు ఇళ్ల లోగిళ్లలో అందమైన ముగ్గులు వేయడానికి మహిళలు రంగులను కొనుగోలు చేస్తున్నారు.

\- జిల్లా ఫొటోగ్రాఫర్, జనవరి 11

సంగారెడ్డి రామ్‌మందిర్ భజనలో పాల్గొన్న జగ్గారెడ్డి

వైకుంఠ ఏకాదశి సందర్భంగా భజన పాటలు ఆలపించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

సంగారెడ్డి రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ఏకాదశి సందర్భంగా సంగారెడ్డిలోని రామ్‌నగర్‌లో ఉన్న రామ్‌మందిరంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి భజన పాటలు ఆలపించారు. రామ్‌మందిరంలో నిర్వహించిన భజనలో ఆయన పాల్గొన్నారు. తన ఇంటి పక్కనే గల రామ్‌మందిర్‌లో ప్రతీ శనివారం జగ్గారెడ్డి భజన నిర్వహిస్తుంటారు. కాగా శుక్రవారం రాత్రి ముక్కోటి వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగిన భజన కార్యక్రమంలోనూ ఆయన పాల్గొని ఆధ్యాత్మిక గీతాలను స్వయంగా ఆలపించి భక్తుల్లో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో రామ్‌మందిర్ భజన మండలి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




సంగారెడ్డిలోని రామ్‌మందిర్‌లో జరిగిన భజనలో పాల్గొని భక్తి గీతాలు ఆలపిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

వారంతా స్నేహితులు.. చిన్న చిన్న పనులు చేసుకునే యువకులు.. ఒకరు బీటెక్ విద్యార్థి. వారాంతం కావడంతో సరదాగా గడపాలనుకున్నారు. టూర్‌ప్లాన్ చేసి టూవీలర్లపై కొండపోచమ్మసాగర్‌కు వచ్చారు. అక్కడి నీటిని చూడగానే వారిలో ఉల్సాహం వెల్లువెత్తింది. కొద్దిసేపు నీటిలో తుళ్లుతూ.. గెంతుతూ గడిపారు. ఫొటోలు దిగేందుకు మరింత దూరం వెళ్లారు. అదే ఐదుగురి ప్రాణాలను తీసింది. హైదరాబాద్ నగరం నుంచి కొండపోచమ్మసాగర్‌కు విహారయాత్రకు వచ్చిన ఏడుగురిలో ఐదుగురు యువకులు నీట మునిగిచనిపోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. చేతికి అందివచ్చిన పిల్లలు.. కొండపోచమ్మకు వెళ్తున్నామంటూ బయలుదేరి శవాలుగా కనిపించడంతో ఆ కుటుంబాలు కన్నీరుమున్నీరు అవుతున్నాయి. అయ్యో బిడ్డ ఎంత పనిజరిగింది అంటూ మృతదేహాలపై పడి రోదించారు.

విహారం.. విషాదం

- కొండపోచమ్మసాగర్‌లో నీట మునిగిన ఐదుగురు యువకులు
- మృతదేహాల గుర్తింపులో కీలకంగా కిట్టు బ్యాచ్
- సహకరించిన శామీర్‌పేట లేక్ ఫైర్ అధికారులు
- నేరుగా రిజర్వాయర్‌లోకి దూకిన సిద్దిపేట రూరల్ సీఐ
- ఆరు గంటల పాటు సీపీ అనురాధ పర్యవేక్షణ



కొండపోచమ్మ రిజర్వాయర్ బండ్‌పై రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు, ఏడుస్తున్న తల్లి



మృతదేహాల కోసం గాలిస్తున్న గజ ఈతగాళ్లు

గజ్వేల్/మర్కుక్/ములుగు, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ నగరంలోని భోలక్‌పూర్‌కు చెందిన అన్నదమ్ములు గ్యార ధనుష్(19), లోహిత్(17), బన్సీలాల్‌పేటకు చెందిన చీకట్ల దినేష్(17), అత్తాపూర్‌కు చెందిన సాహెల్ దీపక్ సుతార్(19), చింతల్‌బస్తీకి చెందిన ఉప్పల జతిన్(17), రాంనగర్‌కు చెందిన మృగాంక్, ముషీరాబాద్‌కు చెందిన మహ్మద్ ఇబ్రహీం(19) శనివారం ఉదయం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని కొండపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మధ్యాహ్నం మర్కుక్ మండలంలోని కొండపోచమ్మసాగర్‌కు వచ్చారు. రిజర్వాయర్‌లో 9.37 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అక్కడి సేఫ్టీవాల్‌ను దాటి లోపలికి వెళ్లిన ఈ ఏడుగురు రిజర్వాయర్‌లో దిగి నీళ్లల్లో ఆడుతూ.. సరదాగా గడపారు. ఐదుగురు యువకులు లోపలికి వెళ్లి ఫొటో దిగుదామని ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయారు. అందులో నలుగురు యువకులు ధనుష్, లోహిత్, జతిన్, దినేష్ మునిగిపోగా సాహెల్ మాత్రం సహాయం కోసం 20 నుంచి 25 నిమిషాల పాటు అరిచాడు. బయట ఉన్న మృగాంక్, ఇబ్రహీం సైతం సాయం కోసం అరిచారు. రిజర్వాయర్‌లోకి ఎవరికి అనుమతి లేకపోవడం, అక్కడ ఎవరూ లేకపోవడంతో అటువైపు ఎవరు చూడలేదు. దీంతో సాయం కోసం ఎదురుచూసిన సాహెల్ సైతం నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ మృతి వార్త గజ్వేల్ డివిజన్‌తో పాటు సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా దావనంలా వ్యాపించింది. ఒక్కసారిగా ప్రజలంతా ఉలిక్కిపడ్డారు.



ఆరుగంటలు శ్రమించిన గజ ఈతగాళ్లు

మృతదేహాల ఆచూకీని కనిపెట్టేందుకు ఆరు గంటల పాటు గజ ఈతగాళ్లు శ్రమించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ ఘటనా స్థలానికి చేరుకుని గజ్వేల్, తొగుట, స్థానిక గజ ఈతగాళ్లను మొదటగా పిలిపించారు. ఈ క్రమంలోనే సిద్దిపేట ఏసీపీ మధు, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను సాయంత్రం నాలుగు గంటలవుతుండగా సిద్దిపేట కోమటిచెరువు కిట్టు బ్యాచ్‌ను తీసుకొని వచ్చారు. వెంటనే వారంతా రంగంలోకి దిగడంతో పాటు, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను సైతం స్వయంగా రిజర్వాయర్‌లోకి దూకారు. ఈ క్రమంలోనే శామీర్‌పేట చెరువును చూసే ఫైర్ సిబ్బంది, స్థానిక గజఈతగాళ్ల సహకారంతో 20 నిమిషాల వ్యవధిలోని మొదటి మృతదేహాన్ని గుర్తించారు. దాదాపుగా ఆరు గంటల పాటు పోలీసులు, గజ ఈతగాళ్లు శ్రమించి ఐదు మృతదేహాలను బయటకు తీసుకువచ్చారు. దాదాపుగా ఆరు గంటల పాటు సీపీ డాక్టర్ బి.అనురాధ, గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, గజ్వేల్ సీఐ మహేందర్‌రెడ్డి, తొగుట సీఐ ఎస్‌కే లతీఫ్ ఘటనా స్థలంలో నిలబడే ఉన్నారు. చివరగా సంఘటన వివరాలను తెలిపాలని సీపీని విలేకరులు కోరినా తాను ఒక తల్లినని, ఆ బాధలోనే చెబుతూ తెలుపుతూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఫుడ్స్ కార్పొరేషన్



ఐదుగురు యువకుల మృతదేహాలు

మిగతా 7వ పేజీలో

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

- ఏడాదిలోనే పథకాలు అమలు చేసిన ఏకైక ప్రభుత్వం
- గౌరవెల్లి ముంపు బాధితుల సమస్యలు పరిష్కరిస్తాం
- నిర్వాసితులపై కేసుల ఎత్తివేయాలని సీఎంను కోరుతా
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. శనివారం ఆయన హుస్నాబాద్ మార్కెట్‌యార్డులో నిర్వహించిన నియోజకవర్గంలోని కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, గ్యాస్, సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చామని, ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతుందని, అర్హులైన వారికి కేటాయిస్తామని తెలిపారు. రైతు భరోసా ద్వారా రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయించామని, కొత్తరేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని వివరించారు. పట్టణంలో గౌరవెల్లి రిజర్వాయర్ ముంపు ప్రజలు నిర్మించుకున్న జీఆర్‌ఆర్ కాలనీలో అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేసి, అనంతరం ముంపు బాధితుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. గౌరవెల్లి, మిడ్‌మానేరు, మల్లన్నసాగర్ సంబంధించిన కేసులు ఎత్తివేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతానన్నారు. మిడ్‌మానేరు నిర్వాసితుల పక్షాన చాలా ఉద్యమాలు చేశామని, అందుకు తనపైనా కేసులు ఉన్నాయని, అప్పటి ప్రభుత్వం ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిపైన కేసులు పెట్టిందన్నారు. ఈ కేసులన్నీ ఎత్తివేయాలని కోరుతానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనారిటీలకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంభించారు. మార్కెట్‌యార్డులో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ముగ్గుల పోటీలను ఆయన పరిశీలించారు. భిన్నమైన ముగ్గులు వేసిన మహిళలను అభినందించారు. వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆర్డీవో రామ్మూర్తి, తిరుపతిరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, బంక చందు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



జనగామ నుంచి వెళ్తున్న ఎడ్లబండ్లు (ఫైల్)

బండెనక బండి.. ఊరే కదులతదండి

- సంక్రాంతికి జనగామ గ్రామ ప్రత్యేకత
- ఏటా వీరభద్ర స్వామి జాతరకు పయనం
- ఎడ్లబండ్లపైనే 20 కిలోమీటర్ల ప్రయాణం
- 70 ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ

7

అభివృద్ధి పనులకు మోక్షమెన్నడో?

- నంగునూరు మండలంలో నత్తనడకన రహదారుల నిర్మాణాలు
- పని ప్రదేశంలో కనిపించని సూచిక బోర్డులు

8

రానున్న రోజుల్లో
న్యాయవ్యవస్థలో ఏఐ కీలకపాత్ర

● హైకోర్టు న్యాయమూర్తి బి.విజయసేన్‌రెడ్డి

చేర్యాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కోర్టు కేసుల పరిష్కారంలో నూతన సాంకేతికత చాలా అవసరమని, భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) న్యాయవ్యవస్థలో కీలకపాత్ర పోషించనున్నదని రాష్ట్ర హైకోర్టు, సిద్దిపేట జిల్లా అడ్మినిస్ట్రేషన్ న్యాయమూర్తి బి.విజయసేన్‌రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణంలో ఫస్ట్ క్లాస్ సివిల్ జూనియర్ కోర్టును శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. లాయర్ ఉద్యోగం స్వేచ్ఛతో కూడుకున్నదని, ప్రజలకు మంచి జరగాలంటే కాలయాపన చేయకుండా సేవలు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. సీనియర్ లాయర్లు జూనియర్లకు అవకాశాలు కల్పించి వారిని వృత్తిపరంగా ఎదిగేలా ప్రోత్సహించాలని సూచించారు. కుటుంబ తగాదాల కేసులను సామాజిక స్పృహతో పరిష్కరించాలని సూచించారు. ప్రస్తుతం ప్రజల ఆర్థికస్థితి గతంతో పోలిస్తే బాగుందని, దశాబ్ధాలుగా ఎంతో కష్టపడితే అది సాధ్యమైందన్నారు. ఆర్థికస్థితి మెరుగ్గా ఉందని ఈ కాలం పిల్లలకు కష్టం విలువ తెలియకుండా చూడొద్దని, డబ్బుల విలువ, బంధాల విలువ తెలిసేలా పెంచాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం జిల్లా న్యాయ సేవాసాధి కారి సంస్థ ద్వారా దివ్యాంగులకు ఉపకరణాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రిన్సిపాల్ సెషన్స్ న్యాయాధికారి సాయిరమాదేవి మాట్లాడుతూ చేర్యాలలో కోర్టు ఏర్పాటుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మి న్యాయమూర్తిని, జిల్లా న్యాయాధికారిని సన్మానించారు. అంతకుముందు సిద్దిపేట సీపీ అనురాధ వారికి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. సిబ్బంది గాడ్ ఆఫ్ ఆనర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ అబ్దుల్‌హమీద్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చేర్యాలలో కోర్టు భవనాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి బి.విజయసేన్‌రెడ్డి

సెయింట్ ఆంథోనీస్‌లో ఎస్‌ఎల్‌సీ కార్యక్రమం



ఎస్ఎస్‌సీ కార్యక్రమ ప్రారంభోత్సవంలో విద్యార్థులు, యాజమాన్యం

సంగారెడ్డి అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో స్టూడెంట్స్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ఎలసీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వెలికి తీయడం, విద్యార్థి నూతన విద్యా ఆవిష్కరణలకు పునాదులు వేయడం, తమ మేధస్సును ఉపయోగించి సరైన మార్గంలో ప్రయాణం చేయడం, సులభమైన పద్ధతిలో విద్యను నేర్చుకోవడం, ధారాళంగా మాట్లాడాలనేదే ఎస్ఎల్‌సీ కార్యక్రమం ఉద్దేశమని ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ అరుణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలోని చెట్లు నరికివేత



హెచ్‌ఎండీఏ భూమిలో నరికివేసిన చెట్లు

రామచంద్రాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం మండలం తెల్లాపూర్‌లోని హెచ్‌ఎండీఏ భూమిలో పెంచిన చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు రాత్రిరాత్రి నరికివేశారు. రెండురోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెల్లాపూర్‌లోని ఇందిరానగర్ వద్ద మిగులు భూమిలో హెచ్‌ఎండీఏ భూముల పరిరక్షణకు మొక్కలు నాటి పరిరక్షణకు సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఏపుగా పెరిగిన మొక్కలను రెండురోజుల క్రితం ఎవరో నరికివేశారు. ఎకరం రూ.40 కోట్లు పలుకుతున్న భూమిని కబ్జా చేయడానికి ప్రభుత్వ పెద్దలు యత్నిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. చెట్ల నరికివేతపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డికి వివరణ కోరగా అది హెచ్‌ఎండీఏ పరిధి అంటూ తెలిపారు.

రోడ్డు బాగు చేయాలని నిరాహార దీక్షలు



నిజాంపేటలో దీక్ష చేస్తున్న గ్రామస్థులు

నిజాంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆ రోడ్డు ఐదేళ్లుగా నరకప్రాయంగా మారింది. బీటీరోడ్డు తీసి కంకర వేశారు. కానీ మళ్లీ తారు రోడ్డుగా వేయడం మరిచారు. ఇన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నా.. అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహించిన నాలుగు గ్రామాల ప్రజలు నిరాహార దీక్షబూనారు. శనివారం మండల కేంద్రమైన నిజాంపేటలో టెంటు వేసుకొని బైఠాయించారు. రోడ్డు పనులు చేసేదాకా దీక్షలు వీడమంటూ నినదించారు.

హనుమాన్ ఆలయాలకు భక్తుల తాకిడి



కొండాపూర్ హనుమాన్ ఆలయంలో బారులు తీరిన భక్తులు

నారాయణఖేడ్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ ప్రాంతంలోని హనుమాన్ ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. సంక్రాంతి సెలవులు కావడంతో, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఖేడ్ మండలం కొండాపూర్‌లోని చరిత్రాత్మకమైన హనుమాన్ ఆలయంలో ఉదయం నుంచే బారులుతీరి హనుమంతుడిని దర్శించుకున్నారు. భక్తులు ఆలయ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ ఆశీస్సులు పొందారు. డోపూరు లొంక హనుమాన్, ఖేడ్ పట్టణంలోని కల్పనా హనుమాన్, భూమయ్య కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయాలకు సైతం భక్తుల తాకిడి పెరిగింది.

రింగ్‌రోడ్డుతో తీరనున్న ట్రాఫిక్ సమస్యలు



ఖేడ్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ జగ్జీవన్ తదితరులు

నారాయణఖేడ్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ మున్సిపాలిటీ చుట్టూ బిట్ల వారీగా లింక్‌రోడ్లతో నిర్మిస్తున్న రింగ్‌రోడ్డు వల్ల పట్టణంలో తీవ్రంగా ఉన్న ట్రాఫిక్ సమస్యలు తీరుతాయని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. మున్సిపాలిటీ శివారులోని ఖేడ్-కంగ్టి రోడ్డు నుంచి చాంద్‌ఖాన్‌పల్లి కమాన్ వరకు బిట్టుగా నిర్మిస్తున్న రోడ్డు పనులను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఖేడ్-కరస్‌గుత్తి రోడ్డులోని మనూరు క్రాస్ రోడ్డు వద్ద 161బీ జాతీయ రహదారి నుంచి మున్సిపాలిటీ చుట్టుగా డీఎస్పీ కార్యాలయం వద్ద 161బీ జాతీయ రహదారినికలుపుతూ ఫార్మేషన్ రోడ్డుగా నిర్మిస్తున్నామన్నారు. ఆయన వెంట కౌన్సిలర్ ముడ రామక్రిష్ణ, మాజీ ఎంపీటీసీలు పండరిరెడ్డి, గడీల నర్సింలు, నాయకుడు శంకర్‌నాయక్ ఉన్నారు.

ఎస్‌పీఎల్ క్రికెట్ పోటీలు ప్రారంభం

పుల్‌కల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం బద్రిగూడెం గ్రామంలో సుల్తాన్‌పూర్ ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) సీజన్-5 క్రికెట్ క్రీడోత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వారంరోజులపాటు కొనసాగనున్న ఈ పోటీలను పుల్కల్ ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్, బీఆర్ఎస్ ఉమ్మడి మండలం సీనియర్ నాయకుడు పట్లోళ్ల విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు.

మస్తు పూత.. నిలబెట్టుకోండిలా..

మద్దూరు, జనవరి 11 : మండలంలో ఈ సారి మామిళ్లకు మస్తు పూత కాసింది. ఈ పూత నిలువడానికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖాధికారులు సూచిస్తున్నారు. ప్రతి 15 నుంచి 20 రోజులకు ఒకసారి నీరు పెట్టాలంటున్నారు. పూత పిందెగా మారే సమయంలో మందులు వాడితే రాలకుండా ఉంటుందని చెబుతున్నారు. నీటి తడులతో పాటు కిలో పోటాష్, కిలో యూరియా చెట్లకు వేస్తే కాయ బరువు పెరగడంతోపాటు నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు. ఉమ్మడి మండలం వ్యాప్తంగా సుమారు 80 ఎకరాల్లో రైతులు మామిడి తోటలు సాగు చేశారు.


ధర్మారంలో ఇరగపూసిన మామిడి పూత

కంది.. దిగుబడిపై రందీ

మనూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కంది పంట ఏపుగా పెరిగినప్పటికీ సరిగా దిగుబడి రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కందులకు మంచి డిమాండ్ ఉండడంతో నారాయణఖేడ్ ప్రాంతంలో ఈసారి అధికమంది కందులను సాగు చేశారు. పూత, కాత సమయంలో వర్షాలు సరిగా పడలేదు. ఆ తరువాత కురిసిన భారీ వర్షాలకు మొక్కలు ఏపుగా పెరిగినా కాయల్లో విత్తులు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందక దిగుబడి తగ్గిందని రైతులు పేర్కొంటున్నారు. గతేడాది ఎకరాకు 8 క్వింటాళ్ల దిగుబడి వస్తే.. ఈసారి 5 క్వింటాళ్ల చొప్పున కూడా రావడం లేదని వాపోతున్నారు. పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కందులకు మద్దతు ధరను పెంచి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



శనగ కూరకు భలే డిమాండ్

నారాయణఖేడ్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): చలికాలంలో మాత్రమే లభించే శనగ కూరకు మార్కెట్‌లో భలే డిమాండ్ ఉన్నది. రబీలో సాగు చేసే శనగ(బెంగాల్ గ్రామ్) పంట నుంచి పూత పూయక ముందు ఆకులను కోసి కూరలు చేసుకోవడానికి వినియోగిస్తారు. సీజనల్‌లో మాత్రమే లభించే శనగ కూరను కొనుగోలు చేసేందుకు జనం పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్నారు. కిలో శనగ కూర రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారు.



క్రైం కార్నర్

చెరకు బండి కిందపడి బాలుడి మృతి

నారాయణఖేడ్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): చెరకు బండి కింద పడి బాలుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖేడ్ మండలం గైర్హాన్ తండాకు చెందిన విజయ్‌కుమార్, సుమిత్రాబాయి దంపతుల ఏకైక కుమారుడు నితిన్‌నాయక్(5)తో కలిసి రెండు నెలల క్రితం చెరకు నరికే పని కోసం కర్ణాటకలోని బీదర్ జిల్లాకు వెళ్లారు. శనివారం ఆ జిల్లాలోని శివరాంపూర్ గ్రామ శివారులో చెరకు నరికే పని చేస్తుండగా, నితిన్ పొలం పక్కన ఆడుకుంటున్నాడు. నరికిన చెరకును కర్మాగారానికి తరలిస్తున్న ఎద్దుల బండి ప్రమాదవశాత్తు బాలుడిపైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులతో పాటు బంధువుల రోదనలు మిన్నంటాయి. శనివారం సాయంత్రం గైర్హాన్‌తండాలో బాలుడి అంత్యక్రియలు నిర్వహించారు. ఖేడ్ తాజామాజీ జడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్‌నాయక్, మాజీ ఎంపీటీసీ రాజునాయక్, తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బాలుడి కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు.


నితిన్‌నాయక్ మృతదేహం

పసివాడి ప్రాణం తీసిన పతంగి

● పతంగి కోసం పరిగెత్తిన బాలుడు
● ట్రాక్టర్ ఢీ కొట్టడం తో మృతి

జోగిపేట, జనవరి11 (ఆంధ్రజ్యోతి): తెగిన గాలిపటం (పతంగి) కోసం పరిగెత్తిన ఓ బాలుడు ట్రాక్టర్ ఢీ కొని మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేటలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. టేక్మాల్ గ్రామానికి చెందిన నీరుడి శ్రీరామ్(11) అనే బాలుడు ఇంట్లో చెప్పకుండా స్నేహితులైన మరో ముగ్గురు స్నేహితులతో కలిసి పతంగుల (గాలిపటాలు) కొనుక్కునేందుకుగానూ ఆటోలో జోగిపేటకు వచ్చారు. పతంగులు కొనుగోలు చేసి ఒక ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో తిన్నారు. ఇంటికి తిరిగి వెళ్లేందుకు ఆటో కోసం బస్టాండ్ వద్దకు వచ్చారు. ఇదే సమయంలో ఒక పతంగి తెగిపోయి రోడ్డుపై పడిపోతోంది. దానిని అందుకుందామన్న ఆశతో శ్రీరామ్ రోడ్డుకు అడ్డంగా పరిగెత్తాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్, బాలుడిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడే ఉన్న వారు బాలుడిని ఏరియా ఆస్పత్రికి తరలించినా లాభం లేకపోయింది. శ్రీరాం తండ్రి సాయిలు 4ఏళ్ల క్రితం చెరువులో పడి మృతి చెందాడు. తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్. ఐ. పాండు తెలిపారు.


నీరుడి శ్రీరామ్

నందిగామ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

●రెండు ముక్కలైన మృతదేహం.. మరొకరికి గాయాలు

పటాన్‌చెరు రూరల్, జనవరి 11 : బీడీఎల్ బానూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నందిగామ వద్ద శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. బీడీఎల్ సీఐ స్వామి గౌడ్ అందించిన కథనం ప్రకారం శంకర్‌పల్లి గణేష్‌నగర్ కాలనీకి చెందిన గొట్టిముక్కల అశోక్ (45), మణిసంకిత్ (20)లు స్కూటీపై పటాన్‌చెరు నుంచి శంకర్‌పల్లి వైపు వెళ్తుండగా నందిగామ నారాయణ స్కూల్ సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. అశోక్ అక్కడికక్కడే మృతిచెందగా, మణిసంకిత్ తీవ్రంగా గాయపడ్డాడు. అశోక్ మీద నుంచి లారీ వెళ్లిపోవడంతో మృతదేహం రెండు భాగాలుగా విడిపోయింది. సమాచారం అందుకున్న బీడీఎల్ సీఐ స్వామి గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకొని మణిసంకిత్‌ను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అశోక్ మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణంలో అగ్ని ప్రమాదం

● కాలి బూడిదైన సామగ్రి


కాలి బూడిదైన సామగ్రి

నర్సాపూర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలోని బస్టాండు ఎదురుగా ఉన్న ఓ హోల్‌సేల్ కిరాణా దుకాణంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బాధితుడు శ్యామ్‌సుందర్ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి 8.30 గంటలకు దుకాణం బంద్ చేసి కుటుంబ సభ్యులతో నాచారం వెళ్లాడు. శనివారం తెల్లవారుజామున దుకాణంలో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. 5 గంటలకు గమనించిన షాపు పక్కనే ఉండే ఓ వ్యక్తి శ్యామ్ సుందర్‌కు ఫోన్ చేసి చెప్పాడు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటలను ఆర్పారు. అప్పటికే పెద్ద ఎత్తున కిరాణా సామగ్రి కాలి బూడిదగా మారింది. రూ.లక్షల్లో నష్టం వాటిల్లినట్టు బాధితుడు తెలిపాడు.

దేవుడి దీపం కిందపడి.. ఇల్లు దగ్ధం

తొగుట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఇల్లు దగ్ధమైన సంఘటన తొగుట మండలం చందాపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నూనె మహేష్ ఇంట్లో ఉదయం దేవుడి గదిలో దీపం వెలిగించారు. ప్రమాదవశాత్తూ దీపం కిందపడి ఇంట్లో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఫైర్ ఇంజన్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఇంట్లో సామగ్రితోపాటు, 8 తులాల బంగారం, 25 తులాల వెండి ఆభరణాలు, రూ.3.80లక్షల నగదు అగ్నికి ఆహుతి అయ్యాయి. రెవెన్యూ అధికారులు ఘటనా స్థలికి చేరుకుని నష్టం వివరాలను తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ నర్సింహులు కోరారు.



మా తాతల నుంచి ఈ ఆచారం వస్తుంది : కాసర్ల కొత్తకొండ

ఈ ఆచారం మా తాతల కాలం నుంచి వస్తుంది. మా తాత రామలింగం, తండ్రి కాసర్ల బుచ్చయ్య కొత్తకొండ వీరభద్రస్వామి భక్తులు. అందుకే నాకు కొత్తకొండ అని పేరు కూడా పెట్టారు. వారు ఇచ్చిన ఈ ఆచారాన్ని నేను 30 ఏళ్లుగా కొనసాగిస్తున్నాను. మా పిల్లలు కూడా ఇప్పటి నుంచే భాగస్వాములవుతున్నారు.


కొత్తకొండ జాతరకు జనగామ నుంచి వెళ్తున్న ఎడ్లబండ్లు (ఫైల్)

బండెనక బండి.. ఊరే కదులుతదండి

● ఏటా హన్మకొండ జిల్లాలోని కొత్తకొండ వీరభద్ర స్వామి జాతరకు పయనం
● ఎడ్లబండ్లపైనే 20 కిలోమీటర్ల ప్రయాణం
● 70 ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ

సంక్రాంతికి జనగామ గ్రామ ప్రత్యేకత

హుస్నాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ అంటే పిండి వంటలు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దులు, సన్నాయి మోతలు, గాలిపటాలే గుర్తుకొస్తాయి. కానీ హుస్నాబాద్ మండలం జనగామ గ్రామంలో మాత్రం కచ్చురంతో కూడిన ఎడ్ల బండ్లు సంక్రాంతి స్పెషల్‌గా నిలుస్తాయి. సంక్రాంతి రోజున హన్మకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో జరిగే వీరభద్రస్వామి జాతరకు వెళ్లడం ఈ గ్రామ ఆనవాయితీ. ఎడ్ల బండ్లపై కచ్చురాలు ఏర్పాటు చేసుకుని, అందంగా అలకరించుకుని 20 కిలోమీటర్ల మేర ప్రయాణించి జాతరకు వెళ్లడం గ్రామ ప్రత్యేకత. మూడు రోజుల ముందు నుంచే ఈ పయనానికి సిద్ధమవుతారు. బండెనక బండి సమారు వంద బండ్లలో గ్రామస్థులు ఒకేసారి వెళ్తుంటే.. చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తారు. 70 ఏళ్లుగా వస్తున్న ఈ సంప్రదా యా న్ని


జాతరకు ముస్తాబవుతున్న ఎడ్ల బండి(ఫైల్)

గ్రామస్థులు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. అప్పటివరకు రాజకీయ విద్వేశాలు, కులాలు, మతాలు తదితర గొడవలు ఉన్నప్పటికీ సంక్రాంతి పండుగ వచ్చిందంటే అందరూ కలసిపోయి మూకుమ్మడిగా జాతర వెళ్తారు. ఈ బండ్లను గ్రామ శివారు వరకు సాగనంపడానికి చిన్న పెద్ద తేడా లేకుండా ఊరుఊరంతా కదలివస్తుంది.

పయనమే.. ఓ పండగలా..

సంక్రాంతి రోజున మధ్యాహ్నం జనగామకు చెందిన కాసర్ల కొత్తకొండ అనే వీరభద్రస్వామి భక్తుడు ప్రత్యేక వేషధారణతో దర్శనమిస్తాడు. ఈ జాతరకు నెల రోజుల ముందు ధనుర్మాసం ప్రారంభమైన నుంచి ఆయన ఉపవాస దీక్షల్లో ఉంటాడు. మొదటి కచ్చురం అతని ఇంటి నుంచే బయలుదేరుతుంది. ఆయన బండి వెనుకనే మిగతావి బయలు దేరుతాయి. బ్యాండ్ మేళాల మధ్య ఊరంతా కదలిరాగా ముందున దివిటిలు పట్టుకొని ఒకరు వెళ్తుంటారు. ఈ దివిటీలకు పోసిన నూనెను చిన్నారుల తలకు అంటుతే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారనేది గ్రామస్తుల నమ్మకం. గ్రామ కూడళ్లలో


వీరభద్రస్వామి ప్రాశాస్త్రాన్ని దండకం ద్వారా చెబుతున్న కాసర్ల కొత్తకొండ (ఫైల్)

కొత్తకొండ వీరభద్రస్వామి చరిత్రను తన దండకం ద్వారా ప్రజలకు వివరిస్తాడు. అతనికి గ్రామస్తులు కొత్తకొండలోని వీరభద్రస్వామికి కానుకలుగా ఇచ్చేందుకు కరెన్సీ నోట్లను మాలలుగా చేసి ఆయన మెడలో వేస్తారు. అతను ప్రజలందరికి విబూతి పెడుతూ దీవెనలు అందజేస్తాడు.

వివాహం చేసుకున్నాకే ప్రేమజంట ఆత్మహత్య

నారాయణఖేడ్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పెళ్లికి పెద్దలు అంగీకరించరనే ఆందోళనతో ప్రేమ జంట మునిపల్లి సమీపంలోని హరిత హోటల్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. మండల కేంద్రమైన నిజాంపేటకు చెందిన ఉదయ్‌కుమార్(21), రోహిత(19) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇరు కుటుంబాలు వారి వివాహానికి అభ్యంతరం తెలిపారు. దీంతో ఈ నెల 9న మునిపల్లి సమీపంలోని హరిత హోటల్‌కు వెళ్లి గదిని అద్దెకు తీసుకొని ముందుగా వివాహం చేసుకున్న తరువాతే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. కాగా, పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను శనివారం కుటుంబ సభ్యులకు అప్పగించడంతో సాయంత్రం అశ్రునయనాలతో విడివిడిగా అంత్యక్రియలు నిర్వహించారు.

ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు

కౌడిపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధి జాతీయ 15 వ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండల కేంద్రంలో నిర్వహించిన సామాజిక తనిఖీ అవతవకలు బయటపడ్డాయి. దీంతో వెల్మకన్నె గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ముత్తయ్య, ధర్మసాగర్ ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేశం రూ.5,66,849 రికవరీ చేయగా, రూ.76 వేలు జరిమానా విధించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు, ఏపీవో కలసి జిల్లా ఉన్నతాధికారుల అండదండలతో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు వస్తున్నాయి త్వరలోనే ఇదే విషయంలో మరికొంత మందికి మెమోలు ఇవ్వనున్నట్లు తెలిసింది. అదేవిధంగా కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.


గొల్లపల్లిలో డ్రిప్ పద్దతిలో ఉల్లి పంట సాగు

అధునిక వ్యవసాయం వైపు రైతుల చూపు

● ఉల్లి పంటలో వినూత్న పద్ధతిని అవలంభిస్తున్నరైతులు

కొండాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కూలీల కొరతను అధిగమించి, కలుపు నివారణ, పంటకు వేసిన మందులు, ఎరువులు దుర్వినియోగం కాకుండా మొతాదులో వాడి సాగు పంటలో ఖర్చులు తగ్గించేందుకు రైతులు వినూత్న పద్ధతిని అవలంభిస్తున్నారు. ఉల్లి పంటలో నారుమడి కట్టి నీరు నింపి తరువాత నారు వేసి, ఎరువులను చల్లే పాత పద్ధతిని రైతులు వీడనాడుతున్నారు. ఉల్లిగడ్డ పంట సాగులో డ్రిప్ పద్ధతిని పాటిస్తూ నీటి వృథా, నారుమడి, కలుపు తీత కూలీ ఖర్చులను తగ్గించుకునే దిశగా ఆసక్తి చూపుతున్నారు. ప్లాస్టిక్ పేపర్‌ను భూమిపై పరిచి ఉల్లి పంటసాగుకు చేస్తున్నారు. పెరిగిన ఎరువుల,మందుల ధరలకు అనుగుణంగా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పొందేందుకు నూతన పద్ధతిని అవలంభిస్తున్నారు.


తేర్పోల్ గ్రామంలో ఉలిగడ్డ నాట్లు

పుచ్చకాయపై వివేకానందుడి చిత్రం

నారాయణఖేడ్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నేడు స్వామి వివేకానందుడి జయంతిని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు శివకుమార్ తన కళతో వినూత్నంగా నివాళుల ర్పించాడు. పుచ్చకాయ, బాదం ఆకులపై స్వామి వివేకానందుడి చిత్రాలను గీసి ఔరా అనిపించాడు.



మిషన్ భగీరథ కార్మికుల ధర్నా


బోర్పట్ల మిషన్ భగీరథ ప్లాంటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

హత్నూర, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని బోర్పట్ల మిషన్ భగీరథ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ వద్ద పని చేస్తున్న కార్మికులు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఫిల్టర్ బెడ్ ప్రధాన ద్వారం ముందు బైఠాయించి, కాంట్రాక్టర్, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు నెలలుగా తమకు జీతాలు చెల్లించడం లేదని, ఇక తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఐదు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. అదేవిధంగా ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యంతో పాటు కనీస వేతనం 18వేల రూపాయలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని ఎడల ఆందోళన కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా మిషన్ భగీరథ కార్మిక సంఘం అధ్యక్షుడు జక్కుల బాబయ్య, లక్ష్మణ్, కుమారస్వామి, రాజు, రవి, నవీన్, విష్ణు, విష్ణువర్ధన్, సత్యనారాయణ, రవీందర్, శ్రీకాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరులో 2 కొత్త సబ్‌స్టేషన్లు

● త్వరలో ప్రారంభించే దిశగా దక్షిణ డిస్కం చర్యలు

హైదరాబాద్ సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సమ్మర్‌లో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేలా సంగారెడ్డి సర్కిల్ పటాన్‌చెరు డివిజన్‌లో రెంటు కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసిన దక్షిణ డిస్కం వాటిని త్వరలో ప్రారంభించే దిశగా ఏర్పాట్లు చేస్తోంది. గతేడాది సమ్మర్‌లో పెరిగిన రికార్డుస్థాయి డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని చక్రపురి, గోషాల ప్రాంతాల్లో 16 ఎంవీఏ సామర్థ్యంలో 2 కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టింది. ఈ సబ్‌స్టేషన్ పనులు పూర్తి చేసిన అధికారులు వాటిని త్వరలో చార్జ్‌చేసే దిశగా చర్యలు చేపట్టారు. ఈ నెలలో రెండు సబ్‌స్టేషన్ల చార్జింగ్ చేసేదిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రెండు సబ్‌స్టేషన్లు అందుబాటులోకి రావడంతో పటాన్‌చెరువు డివిజన్‌లో డిమాండ్ ఏస్థాయిలో పెరిగిన సమ్మర్‌లో ఇబ్బందులు తలెత్తవని అధికారులు చెబుతున్నారు.

విహారం.. విషాదం

(5వ పేజీ తరువాయి)

మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

కొండపోచమ్మసాగర్ బండ్‌పై మిన్నంటిన రోదనలు

ఐదుగురు యువకులు మృతిచెందగా, నాలుగు కుటుంబాలకు చెందిన బంధువులు, కుటుంబసభ్యులు బండ్‌పైకి చేరుకున్నారు. ఈ క్రమంలోనే బండ్‌పై పూర్తిగా విషాదఛాయలు అలుముకున్నాయి. ఎక్కడ చూసిన రోధనలు కనిపించాయి. ఇద్దరు పిల్లల్ని కోల్పోయిన నర్సింగరావు కుటుంబాన్ని చూసి ప్రతీఒక్కరు కన్నీటి పర్యంతమయ్యారు. వారిని సముదాయించేందుకు ఎవరు ప్రయత్నించినా కూడా కడుపుకోత మిగిల్చిన కుమారులను చూసి ఆవేదన వ్యక్తం చేశారు.

గజ్వేల్ ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తి

గజ్వేల్ పట్టణంలోని జిల్లా ఆసుపత్రిలో ఐదుగురు యువకులు మృతదేహాలకు వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. సీఐలు సైదా, లతీఫ్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబాలకు మృతదేహాలను అప్పగించారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఒక్కసారిగా ఐదుగురి మృతదేహాలు మార్చురీకి రావడంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబాలను గజ్వేల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జీ వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు. ఈ క్రమంలోనే గజ్వేల్ ఆసుపత్రి ప్రాంగణం రోదనలతో మునిగిపోయింది.


సంఘటనా స్థలం వద్ద సిద్దిపేట ఎస్పీ

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

రాయపోల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం ఉదయం రాయపోల్ ఉన్నత పాఠశాల సమీపంలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లికి చెందిన మునీర్ గజ్వేల్‌లో వెల్డర్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం గజ్వేల్ నుంచి దౌల్తాబాద్ వైపు బయలుదేరాడు. ఈ క్రమంలో రాయపోల్‌లోని పాఠశాల సమీపంలో మూల మలుపు వద్ద గుర్తు తెలియని వాహనం అతడి బైక్‌ను ఢీకొంది. కింద పడిపోయిన మునీర్ తలకు తీవ్రంగా గాయమైంది. ఆయనను వెంటనే గజ్వేల్ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

అభివృద్ధి పనులకు మోక్షమెన్నడో?

- నంగునూరు మండలంలో నత్తనడకన రహదారుల నిర్మాణాలు
- పని ప్రదేశంలో కనిపించని సూచిక బోర్డులు
- వాహనదారులకు తప్పని తిప్పలు

నంగునూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో రహదారుల నిర్మాణ పనులు నత్తనడకన సాగడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నంగునూరు మండలం పాలమాకుల వద్ద చేపడుతున్న కల్వర్టు నిర్మాణ పనులు నత్త నడకన సాగడంతో వాహనదారుల తిప్పలు అంతా ఇంతా కాదు. పాలమాకుల శివాలయం టెంపుల్ సమీపంలో చేపడుతున్న కల్వర్టు నిర్మాణ పనులు గత ఆరు నెలలుగా నిలిచిపోయాయి. కల్వర్టు నిర్మాణం పూర్తి చేయకపోవడంతో ఆ దారి నుంచి వెళ్లే వాహనదాం కొనసాగుతున్నట్టు కనీసం సూచికల బోర్డు కూడా పెట్టకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నకోడూరు మండలం మల్లారం నుంచి నంగునూరు మండలం పాలమాకుల మీదుగా వెంకటాపూర్ తిమ్మాయపల్లి బందారం వరకు రింగు రోడ్డు పనులు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా సూచికల బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో ఈ దారిలో వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి కల్వర్టు నిర్మాణ పనులు పూర్తి చేసి రహదారిని వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


పాలమాకుల ఓబులాపూర్ రోడ్డులో నత్త నడకన సాగుతున్న కల్వర్టు పనులు

పతంగులు ఎగురవేస్తూ.. ఉత్సాహాన్ని పంచుతూ..


చేర్యాలలో కుడిచెరువు కట్టపై పతంగి ఎగురవేస్తున్న జనగామ ఎమ్మెల్యే

చేర్యాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : నిత్యం రాజకీయ, వ్యక్తిగత జీవితంలో బిజీగా గడుపుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శనివారం ఆటవిడుపుగా అందరికీ ఉత్సాహాన్ని పంచారు. సంక్రాంతిని పురస్కరించుకుని చేర్యాల పట్టణంలోని కుడిచెరువు ఆవరణలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొని బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారులకు పతంగులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే, తాను కూడా వారితో కలిసి చెరువుకట్టపై పతంగిని ఎగురవేశారు. అంతకుముందు ఆయన కొమురవెల్లిలో నిర్వహించిన వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. కొంతసేపు వాలీబాల్ సర్వీసింగ్ చేసి యువకుల్లో ఉత్సాహాన్ని నింపారు. యువకులు, చిన్నారులతో కలిసి ఆటలాడిన ఎమ్మెల్యే వారికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- పలు మండలాల్లో జాతీయ భద్రత వారోత్సవాలు

సిద్దిపేట క్రైం/దూళిమిట్ట/దౌల్తాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం పలు మండలాల్లో పోలీసులు ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. సిద్దిపేట పట్టణంలోని నరసాపూర్ చౌరస్తాలో సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ సీఐ ప్రవీణ్‌కుమార్ తో కలసి డీసీఎం డ్రైవర్లకు, యజమానులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. డీసీఎం లాంటి పెద్ద వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే పార్కు చేసుకోవాలని సూచించారు.వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు ఇన్సూరెన్స్ తప్పకుండా కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎం డ్రైవర్లు యజమానులు సిద్దిపేట ట్రాఫిక్ ఏఎస్ఐలు ఉమేష్, సదాశివరావు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు. దూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలో గ్రామస్థులకు రోడ్డు భద్రత నియమాల గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఏఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు అవగాహన కల్పించారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో యువతకు, ప్రజలకు ఎస్ఐ శ్రీరాం ప్రేమ్‌దీప్ ట్రాఫిక్ రూల్స్, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.


సిద్దిపేటలో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

'ట్రాఫిక్ అవగాహన'తో స్ఫూర్తి

గజ్వేల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాలతో స్ఫూర్తి పొందిన ఓ వాహనదారుడు బకాయి చలాన్లను చెల్లించాడు. దీంతో గజ్వేల్ ట్రాఫిక్ పోలీసులు శనివారం ఆ వ్యక్తిని సన్మానించారు. వివరాల్లోకి వెళ్తే.. గజ్వేల్ మండలం బెజుగామ గ్రామానికి చెందిన అందే కరుణాకర్ తన వాహనంపై నాలుగు చలాన్లకు గాను మొత్తం రూ.4,145 బకాయి పడ్డాడు. ఇటీవల నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలతో తాను స్ఫూర్తిని పొంది బకాయిపడిన చలాన్ల మొత్తాన్ని శనివారం క్లియర్ చేసినట్టు కరుణాకర్ తెలిపాడు. ఈ సందర్భంగా గజ్వేల్ ట్రాఫిక్ ఏఎస్ఐ జగదీశ్వర్ అతడిని శాలువాతో సత్కరించారు.


వాహనదారుడిని సన్మానిస్తున్న ఏఎస్ఐ

సిద్దిపేట పాత వేంకటేశ్వర స్వామి ఆలయంలో కూడార్రై ఉత్సవం


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

సిద్దిపేట క్రైం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని పాత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆలయ మహిళా గోష్ఠి వారి ఆధ్వర్యంలో కూడార్రై ఉత్సవం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు 108 గంగాళాల్లో మహా ప్రసాద నివేదన కార్యక్రమం ప్రారంభించి ఒంటి గంట వరకు నిర్వహించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఆలయంలో గోదారంగనాయక కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

● చేర్యాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసోత్సవంలో భాగంగా చేర్యాల పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం కుడార్రై విశేషాప్పాట్టును ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా గోదాదేవికి విశేషపూజలు నిర్వహించారు. పాశురపఠనానంతరం భక్తులకు ప్రసాదవితరణ చేశారు.

నేడు గోదాదేవి రంగనాయకుల కల్యాణం


కల్యాణానికి ముస్తాబైన సీతారామచంద్రస్వామి విగ్రహం

హుస్నాబాద్‌రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం పొట్లపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 12న ఆదివారం గోదాదేవి రంగనాయకుల స్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు కానుగుల మోహన్ తెలిపారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానున్నట్లు తెలిపారు. కల్యాణానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అలాగే గ్రామంలో రావుల మల్లిఖార్జున స్వామి ఆలయంలో శివకల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్టు అర్చకులు తెలిపారు.

హక్కుల సాధనకు ఐక్య పోరాటం చేయాలి

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మున్నూరు కాపుల హక్కుల సాధనకై ఐక్య పోరాటం చేయాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పిలుపునిచ్చారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం సిద్దిపేట మున్నూరు కాపు సంఘం నూతన క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య, నాయకులు పాల సాయిరాం ముఖ్యఅతిథిగా పాల్గొని క్యాలెండర్ డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్నూరు కాపులందరూ కలిసికట్టుగా ఉంటేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు.

ఉజ్జయినిలో మహా రుద్రయాగానికి తరలిన వేదపండితులు

జగదేవ్‌పూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం బిహార్‌లోని ఉజ్జయినిలో ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు 5 రోజుల పాటు మహారుద్ర యాగం తలపెట్టారు. ఈ యాగానికి తెలంగాణలోని హైదరాబాద్, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ ప్రాంతాలకు చెందిన 60 మంది వేద పండితులు శనివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఉజ్జయిని బయలుదేరి వెళ్లారు. మర్కుక్ మండలం భవనందపూర్ గ్రామంలో గల పాండురంగ ఆశ్రమ నిర్వాహకుడు అప్పాల సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో, మదనానంద ధార్మిక సేవాపరిషత్ వైదిక నిర్వహణలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉజ్జయిని బయలుదేరి వెళ్లిన వారిలో మధుసూదనశర్మ, సనాతన శర్మ, పాండురంగశర్మ తదితరులు పాల్గొన్నారు.

పొట్లపల్లిలో బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్‌రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం పొట్లపల్లి శ్రీ మల్లిఖార్జున స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను శనివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు జరిగే జాతరకు హాజరు కావాలని ఆలయ కమిటీ సభ్యులు మంత్రిని ఆహ్వానించారు. పోస్టర్ ఆవిష్కరణలో ఆలయ కమిటీ సభ్యులు మార్క చంద్రయ్యగౌడ్, మార్క అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు


ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

జగదేవ్‌పూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పదిహేను రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడంలేదని మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేసిన సంఘటన మండలంలోని ఇటిక్యాల గ్రామంలో శనివారం చోటుచేసుకున్నది. ఉదయం మహిళలు ఖాళీ బిందెలు తీసుకొచ్చి రోడ్డుకు అడ్డంగా పెట్టి బైఠాయించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గత పదిహేను రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తలా కొన్ని డబ్బులు పోగేసుకొని స్థానికంగా బోరుబావిని తవ్వించుకున్నట్లు పేర్కొన్నారు. పలుసార్లు సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకపోయినా ఫలితం లేదని మండిపడ్డారు. మహిళలు రోడ్డెక్కిన సమాచారమందుకున్న జగదేవ్‌పూర్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మహిళలకు నచ్చజెప్పారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు ఏఈ హామీనివ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


నారాయణరావుపేటలో అంగన్‌వాడీ భవనం పనులు ప్రారంభిస్తున్న హరికృష్ణ

సిద్దిపేట రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పేర్కొన్నారు. శనివారం నారాయణరావుపేట మండల కేంద్రంతో పాటు లక్ష్మీదేవిపల్లి, కోదండరావుపల్లి గ్రామాల్లో రూ.73 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వం నారాయణరావుపేటను మండలంగా చేసినా అభివృద్ధిని మరిచారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో దశలవారీగా నిధులు కేటాయించి మండల కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు మంద పాండు, జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బుచ్చిరెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

రామేశ్వరంపల్లిలో న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

దుబ్బాక,జనవరి11(ఆంధ్రజ్యోతి): గర్భిణులు న్యూట్రిషన్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కార్తీకఫౌండేషన్ అధ్యక్షురాలు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీకగౌడ్ పేర్కొన్నారు. శనివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి గ్రామంలో ఆకుల ఇందిరా అనే గర్భిణికి చీర న్యూట్రీషన్ కిట్‌ను అందజేశారు. నియోజకవర్గంలోని 8నెలలు దాటిన గర్భిణులందరికీ కార్తీకఫౌండేషన్ ద్వారా న్యూట్రిషన్ కిట్లను అందించనున్నట్టు కార్తీకగౌడ్ తెలిపారు.

ఎస్సీ సెల్ అధ్యక్షుడి కుటుంబానికి పరామర్శ

దౌల్తాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బందారు లాలు మాతృమూర్తి అనారోగ్యంతో మృతి చెందింది. కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతదేహానికి నివాళులర్పించారు.

గజ్వేల్‌కు కేసీఆర్ చేసిందేమీ లేదు


గజ్వేల్‌లో లాల్‌బహదూర్ శాస్త్రీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నర్సారెడ్డి

కుకునూరుపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని, నాయకులు కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన బొబ్బాయిపల్లి, కుకునూరుపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్ర మాలను ప్రారంభించారు. బొబ్బాయిపల్లిలో రూ. 10లక్షల సీసీ రోడ్డు, అంగన్‌వాడీ భవనం, కుకునూరుపల్లిలో రూ. 10 లక్షల సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లపాటు గజ్వేల్ ఎమ్మెల్యేగా ఎన్నికై ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ నియోజకవర్గంలో చేసిందేమీ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచే అన్ని పథకాలు మొదలయ్యాయన్నారు. బొబ్బాయిపల్లి గ్రామంలో విద్యుత్ సమస్యను నెలలోపు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

● గజ్వేల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం హర్షణీయమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని కోర్టు వద్ద ఏర్పాటు ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి విగ్రహాన్ని ఆయన నాయకులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు తదితరులున్నారు.

మాదిగ ఉపకులాల జేఏసీ ఎన్నిక

జగదేవ్‌పూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో మాదిగ, మాదిగ ఉపకులాల జేఏసీ జగదేవ్‌పూర్ మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని 18 గ్రామాల్లో ఉన్న మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డ్‌సభ్యులు, ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ సంఘాల నాయకులు ఫిబ్రవరి 7న జరిగే 'లక్ష డప్పులు, వెయ్యి గొంతులు' జాతరను విజయవంతం చేయాలని కమిటీ పిలుపునిచ్చింది. కాగా సమావేశంలో మండల జేఏసీ అధ్యక్షుడిగా మాసపాక యాదగిరితో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

● సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి చలో హైదరాబాద్ మాదిగల మహాగర్జన సభను విజయవంతం చేద్దామని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మాదిగల మహాగర్జన కరపత్రాన్ని ఆవిష్కరించారు.

● చేర్యాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన వేల గొంతుకలు, లక్ష డప్పుల సన్నాహక రథయాత్ర ఈ నెల 13న చేర్యాలకు చేరుకుంటున్నందున అధికసంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి మల్లిగారి యాదయ్య పిలుపునిచ్చారు.. శనివారం చేర్యాలలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సీసీరోడ్డు నిర్మాణానికి ఎన్ఆర్ఐ విరాళం

చేర్యాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు డాక్టర్ ప్రతాప్‌రెడ్డి గ్రామంలోని గ్రంథాలయ భవన ఆవరణలో సీసీరోడ్డు నిర్మాణానికి వ్యక్తిగత విరాళమందించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. గ్రామంలో విద్యాభివృద్ధికి పాటుపడుతున్న ప్రతాప్‌రెడ్డి సేవలను స్థానికులు కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచులఫోరం మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంబరాలు

సిద్దిపేటలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు, పాలు పొంగించి సంబురాలు ప్రారంభించారు. సంబురాల్లో భాగంగా భోగిమంటలు వేశారు. గంగిరెద్దు విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, పతంగులను ఎగురవేశారు. ఫుడ్‌స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థినులు దాండియా, ర్యాంప్ వాక్‌తో వేడుకను ఉర్రూతలూగించారు.

- సిద్దిపేట అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి)


కళాశాల ఆవరణలో డూడూ బసవన్న విన్యాసాలను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు



కొమురవెల్లి మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు హరిదాసుల వేషధారణతో ఆకట్టుకున్నారు. పాఠశాల ఆవరణలో రంగవల్లులు వేసి, గొబ్బెమ్మలు పెట్టారు. భోగిమంటలు వేశారు. ప్రిన్సిపాల్ నీరజ మాట్లాడుతూ పండుగలు, సంప్రదాయాల విశిష్టతను తెలిపేందుకే సంబురాలు నిర్వహించామన్నారు.

- చేర్యాల, జనవరి 11(ఆంధ్రజ్యోతి)

వాసవి క్లబ్, వనిత క్లబ్, అంబిటస్ స్కూల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సిద్దిపేట పట్టణంలోని అంబిటస్ స్కూల్ ప్రాంగణంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళావిభాగం కార్యదర్శి మాంకాల నాగరాణి, వాసవీక్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా కోశాధికారి సోమ వనజ వ్యవహరించారు. ప్రథమ బహుమతి సుష్మిత, ద్వితీయ శ్రావణి, తృతీయబహుమతి నాగరాణి అందుకున్నారు. పోటీలో పాల్గొన్నవారందరికీ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

- సిద్దిపేట క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి)





సిద్దిపేట పట్టణంలోని కాకతీయ టెక్నో హైస్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకల్లో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొని సందడి చేశారు. మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. భోగి మంటలు వేసి పాలు పొంగించారు. 20 రకాల పిండి వంటలతో ఎగ్జిబిషన్ నిర్వహించారు. కైట్ ఫెస్టివల్, గంగిరెద్దుల విన్యాసాలు, అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలిచిన మహిళలకు నగదు బహుమతులు అందించారు.

- సిద్దిపేట క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి)

సిద్దిపేట పట్టణంలోని 20వ వార్డులో వార్డు కౌన్సిలర్ మహమ్మద్ రియాజుద్దీన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో వార్డులోని మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ అరుణ, కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మీఆనంద్, ఐక్యూఆర్ఏ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆయేశా వ్యవహరించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు మంద వనజ, సంతోష, భవానీ, మల్లేశం, జుబెర్ హుస్సేన్, సలీమొద్దీన్, హబీబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

- సిద్దిపేట టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి)

